Email : telanganaveenaoffcial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

స్పాట్ ఎడిషన్

epaper.telanganaveena.com హైదరాబాద్ మంగళవారం 01.10.2024

## కేటీఆర్ కారుపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలు



హైదరాబాదులోని మూసి పరివాహక ప్రాంతాలలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మూసి బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న కేటీఆర్ కారుపై దాడి చేశారు కొంతమంది కాంగ్రెస్ నేతలు. ఇవాళ ముషీరాబాద్ లోని మూసి పరివాహక ప్రాంతాలను సందర్శించేందుకు కేటీఆర్ పయనమయ్యారు. ఈ తరుణంలోనే కేటీఆర్ వాహనాన్ని.. అడ్డుకొని--- దాడి చేసే ప్రయత్నం చేశారు.దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కాంగ్రెస్ నేతలను.. కేటీఆర్ అనుచరులు ఆడుకునే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. అయితే దీనిపై గులాబీ నేతలు ఫైర్ అవుతున్నారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్తే కూడా తప్పిదమా ? పెద్ద నేరంగా భావించి ఇలా దాడులు చేయడం కరెక్టేనా? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# మూసీ నది ఒడ్డున మొదలైన కూల్చివేతలు

*స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్లను కూల్చేస్తున్న అధికారులు
*బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో కూలీల ఏర్పాటు
*నిర్వాసితులను తరలించేందుకు వాహనాలు సమకూర్చిన సిబ్బంది

తెలంగాణ వీణ,హైద్రాబాద్ : మూసీ నది ప్రక్షాళనలో భాగంగా నదీపరీవాహక ప్రాంతంలోని ఇళ్లను మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ కూల్చివేస్తోంది. శంకర్ నగర్ లో అధికారులు మంగళవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. ఇరుకు సందులు కావడంతో బుల్డోజర్లు వెళ్లే పరిస్థితి లేక కూలీలను పెట్టి పనికానిస్తున్నారు. నిర్వాసితులను ఇప్పటికే చంచల్‌గూడ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయానికి తరలించారు. మరికొంతమంది నిర్వాసితులను తరలించేందుకు, ఇళ్లల్లోని సామగ్రి తీసుకెళ్లేందుకు అధికారులు వాహనాలను ఏర్పాటు చేశారు.మూసీ సుందరీకరణ పనుల్లో భాగంగా రివర్ బెడ్ పరిధిలో సుమారు 55 కి.మీ పరిధిలో 40 వేల ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు గుర్తించారు. చాదర్‌ఘాట్ మూసీ పరీవాహక ప్రాంతాల్లోని మూసానగర్, రసూల్‌పుర, వినాయక్‌నగర్ పరిసరాల్లో ఇళ్లకు రెవెన్యూ అధికారులు మార్కింగ్ చేశారు. ఇందులో ప్రస్తుతం స్వచ్ఛందంగా ఖాళీ చేసిన వారి ఇళ్ల కూల్చివేతను ప్రారంభించారు.



## మహిళపై ఓలా క్యాబ్ డ్రైవర్ వేధింపులు.. సంస్థకు రూ. 5 లక్షల ఫైన్!



తెలంగాణ వీణ,కర్ణాటక: మహిళపై ఓలా క్యాబ్ డ్రైవర్ వేధింపులకు పాల్పడిన కేసులో కర్ణాటక హైకోర్టు సంస్థకు రూ. 5లక్షల జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. 2018 ఆగస్టులో ఓ మహిళ తాను వెళ్లాల్సిన చోటుకు ఓలా క్యాబ్ బుక్ చేసుకుంది. అందులో వచ్చిన క్యాబ్ డ్రైవర్ ప్రయాణ సమయంలో ఆమెతో అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రయాణికురాలు ఆరోపించింది.బ్యాక్ వ్యూ మిర్రర్‌లో మహిళకు కనిపించేలా తన మొబైల్‌లో నీలి చిత్రాలు చూశాడు. అంతటితో ఆగకుండా ఆమె ముందే అసభ్యకర చర్యలకు పాల్పడ్డాడు. దాంతో అతని ప్రవర్తన నచ్చక ఆమె తన గమ్యస్థానానికి ముందే దిగిపోవాలని ప్రయత్నించింది. డ్రైవర్‌ను కారు ఆపాలని కోరింది. దానికి అతడు నిరాకరించినట్లు మహిళ పేర్కొంది.ఈ విషయమై ఓలాకు ఫిర్యాదు చేసింది. దాంతో డ్రైవర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టామని చెప్పిన సంస్థ తదుపరి చర్యలు తీసుకోకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ ఘటనపై పోష్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇక ఈ కేసులో విచారణ జరపాలని కంపెనీ అంతర్గత ఫిర్యాదుల కమిటీని జస్టిస్ ఎంజీఎస్ కమల్ ఆదేశించారు. 90 రోజుల్లోగా కోర్టు ముందు నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన ఓలా కంపెనీ డ్రైవర్లు సంస్థ ఉద్యోగులు కాదని, అందుకే పోష్ చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడానికి అనుకూలం కాదంటూ ఐసీసీ ద్వారా తెలియజేసింది.దాంతో ఐసీసీ నివేదికపై విచారణ జరిపిన హైకోర్టు ఓలా సంస్థ యాప్ డౌన్‌లోడ్ చేసే సమయంలో కస్టమర్లకు భద్రత, రక్షణ ఒప్పంద హామీలు ఇవ్వడాన్ని గుర్తు చేసింది. ఈ ఒప్పంద హక్కులను ఉల్లంఘించినందుకు గాను బాధితురాలికి తగిన పరిహారం చెల్లించాలని పేర్కొంది.ఇందులో భాగంగా మహిళకు రూ. 5లక్షలు పరిహారంగా ఇవ్వాలని ఓలా మాతృ సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్‌ను ఆదేశించింది. దీంతో పాటు పిటిషనర్‌కు మరో రూ.50వేలు చెల్లించాలని జస్టిస్ ఎంజీఎస్ కమల్ తీర్పును వెల్లడించారు.



బంగారం 24
77410/-
వెండి KG
92004/-

# బాధిత కుటుంబాలందరికీ 4వ తేదీలోగా సాయం అందాలి:సీఎం చంద్రబాబు

తెలంగాణవీణ,ఆంధ్ర:ఏపీలో భారీవర్షాలు,వరదలకునష్టపోయిన ప్రజలకు అందిన పరిహారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. ఇప్పటి వరకు అందిన సాయం, లబ్ధిదారుల సమస్యలు, ఫిర్యాదులపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అందించాల్సిన రూ.602 కోట్ల పరిహారం పంపిణీకి గాను రూ.588.59 కోట్లు లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో రైతులకు పంట నష్టపరిహారం కింద జరిపే చెల్లింపులు రూ.301 కోట్లు కాగా...మిగిలిన మొత్తం ఇళ్లు, షాపులు మునిగి ఆస్తులు నష్టపోయిన వారికి పరిహారంగా అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం బాధితుల అకౌంట్లకు నగదు డీబీటీ పద్ధతిలో అందించగా...అందులో 97 శాతం మంది లబ్ధిదారుల అకౌంట్లకు పరిహారం జమ అయిందని అధికారులు వివరించారు. అయితే 22,185 మంది లబ్ధిదారులకు సంబంధించి బ్యాంక్ అకౌంట్ల లోపాలు, సాంకేతిక సమస్యల కారణంగా నగదు జమ అవ్వలేదని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేయాలని...ఏ ఒక్కరూ అసంతృప్తితో ఉండడానికి వీల్లేదని అధికారులను సిఎం ఆదేశించారు. అర్హులెవరికీ సాయం అందకుండా ఉండేందుకు అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు.ఇప్పటికీ కొంత మంది పరిహారం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని...వాటిని పరిశీలించి అర్హత ఉంటే ప్రభుత్వం నుండి సాయం అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. అర్హులుగా ఎంపికై ఎవరికైతే డబ్బులు వారి అకౌంట్లలో పడలేదో...వారు సచివాలయ సిబ్బంది ద్వారా సమస్య పరిష్కరించుకోవాలని కోరుతున్నామని అధికారులు తెలిపారు. వచ్చే శుక్రవారం నాటికి సాంకేతిక సమస్యలు అన్నీ పరిష్కరించి పూర్తి స్థాయిలో పరిహారం పంపిణీ పూర్తి చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. వాహనాలకు బీమా చెల్లింపు, రుణాల రీషెడ్యూల్, అర్బన్ కంపెనీ ద్వారా ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ వంటి అంశాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, అనగాని సత్యప్రసాద్, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

